క్లుప్తంగా

ఏచూరికి నివాళి



నివాళులర్పిస్తున్న గంగరాజు, మురళి

పుంగనూరు: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం స్థానిక ప్రజాశక్తి కార్యాలయంలో జిల్లా కార్యదర్శి గంగరాజు, సీఐటీయూ పట్టణ కార్యదర్శి మురళి, జిల్లా నాయకుడు గుప్తా , మహిళలు కలసి ఆయన ఏచూరి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించారు.

మాజీ సర్పంచ్ మృతి



లక్ష్మీకాంతయ్య (ఫైల్)

కుప్పం రూరల్: మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు లక్ష్మీకాంతయ్య(49) హఠాన్మరణం చెందారు. కుప్పం మండలం వానగుట్టపల్లెకు చెందిన ఆయన బుధవారం అర్ధరాత్రి మృతి చెందారు. రాత్రి పొలాలకు నీళ్లు పారించి వచ్చి ఇంట్లో పడుకున్నాడని, మరలా ఉదయం పైకి లేవలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతికి గుండెపోటు కారణమై ఉండవచ్చని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. లక్ష్మీకాంతయ్యకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

వరద బాధితులకు విరాళం



చెక్కును చూపుతున్న వైస్ చైర్మన్ సునీల్‌రాజ్

కుప్పం రూరల్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి 5 లక్షల రూపాయలు విరాళం ఇస్తున్నట్లు కుప్పం ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్ తెలిపారు. యాజమాన్యం తరపున రూ. 3 లక్షలు, అధ్యాపకులు, విద్యార్థుల నుంచి రూ.2లక్షలు చెక్కుల రూపంలో పంపుతున్నట్లు ఆయన చెప్పారు. వరద విలయానికి సర్వం కోల్పోయిన ఆదుకోవడం మానవతా ధర్మమని, దీనికి అందరూ ముందుకురావాలని కోరారు. కార్యక్రమంలో సీఈఓ సాగర్‌రాజ్, ప్రిన్సిపల్ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ భాస్కరన్, పీఆర్వో ప్రవీణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయరూ!



ఎమ్మెల్యేను కలిసిన కాంట్రాక్టు లెక్చరర్లు

పలమనేరు: స్థానిక జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఆ కాలేజీ కాంట్రాక్టు అధ్యాపకులు గురువారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని కలసి వినతిపత్రం అందజేశారు. దీనిని సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గురుప్రసాద్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాగేంద్ర, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

అప్పినపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్'



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి మురళి

పెద్దపంజాణి: మండలంలోని అప్పినపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పెద్దపంజాణి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి టి.మురళి రోగులను పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో ఇళ్లకే పరిమితమైన రోగుల వద్దకు వెళ్లి వైద్యసేవలు అందించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. గర్భవతులు రక్తహీనత సమస్యను అధిగమించేందుకు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పీ వనజ, ఏఎన్ఎం పుణ్యవతి, ఆశా వర్కర్ అమరావతి పాల్గొన్నారు.



పండ్ల వినాయకుడు..!

పలమనేరు: పట్టణంలోని గంగమ్మగుడి వీధిలో పండ్ల దుకాణాల నిర్వాహకులు ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాన్ని గురువారం పలు రకాల పండ్లతో అలంకరించారు. ఇక్కడ విగ్రహం వద్ద ప్రత్యేక పూజల అనంతరం అన్నదానం చేశారు.

విచ్చలవిడిగా యూరియా వాడకం

- కొండెక్కిన భూసార పరీక్షల ఫలితాలు
- రైతు సేవా కేంద్రాలకు యూరియా వస్తే తొలుత పచ్చ నేతలకే!
- సామాన్య రైతులకు అగచాట్లే



మార్కెట్‌లో అందుబాటులో ఉన్న నానో ఎరువులు



పంటకు సూక్ష్మ పోషక ఎరువులను చల్లుతున్న దృశ్యం

పలమనేరు: వివిధ పంటల సాగులో సూక్ష్మ పోషకాలే కీలకపాత్ర పోషిస్తాయి. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే వరి పంటకు అవసరమైన పోషకాలను అందించాల్సిన తరుణమిదే. అయితే భూసార పరీక్షలు చేయించి, వాటి ఫలితాల ఆధారం ఏ మేరకు ఎరువులు వాడాలో రైతులు పట్టించుకోవడం లేదు. కొందరు రైతులు వరికి యూరియాను విపరీతంగా వాడుతున్నారు. దీంతో మేలు కంటే నష్టమే ఎక్కువని వారికి చెప్పేవారూ లేరు. మరోవైపు ప్రభుత్వం నుంచి రైతు సేవా కేంద్రాలకు వస్తున్న వస్తున్న యూరియాను అధికార పార్టీకి పేరుచెప్పి కొందరు ఎక్కువ బస్తాలను తీసుకెళుతున్నారు. అవసరమైన రైతులకు మాత్రం యూరియా లభించడం లేదు.

సూక్ష్మ ధాతువుల పాత్ర ఇలా..

మొక్క ఎదుగుదలకు, ఇతర పోషకాల సమర్థ వినియోగానికి జింకు సల్ఫేట్ ఎంతగానో ఉపయోగపడుతుంది. జింకు లోపిస్తే ఆకుల ఈనెలు మధ్య భాగం పసుపు రంగులోకి మారి ఆకులు చిన్నవిగా అవుతాయి. దీని నివారణకు ఎకరాకు 20 కిలోల జింకు సల్ఫేట్‌ను దుక్కిలో చల్లుకోవాలి. భాస్వరం ఎరువుతో కలిపి దీన్ని వాడరాదు.

- మొక్కల పూతదశలో సంపర్కం, ఫలదీకరణలో బోరాన్ కీలక పాత్ర వహిస్తుంది. ఇదిలోపిస్తే ఆకులు కురచబడి, ఆకు కొనలు నొక్కుకుపోయినట్లు, పెళుసు బారుతాయి. దీని నివారణకు గాను ఎకరాకు కిలో బోరాక్స్‌ను ఆఖరి దుక్కిలో వేసుకోవాలి.
- జిప్సం ఎరువులో కాల్షియం, గంధకం ధాతువులు ఉంటాయి. నూనె గింజల్లో మాంసకృత్తులు, నూనె శాతం పెరగడానికి ఉపయోగపడుతుంది. దీని నివారణకు ఎకరా పొలానికి 200 కిలోల జిప్సంను చివరి దుక్కిలో వేయాలి. ఈ జాగ్రత్తలు పాటిస్తే పంటలు బాగా పండి అధి ఉత్పత్తిని సాధించవచ్చు.

యూరియా కోసం తప్పనిపాట్లు

ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం బస్తా యూరియాను రూ.280 కి ఇస్తోంది. ఇదే దుకాణాల్లో రూ.300 విక్రయిస్తున్నారు. అది కూడా ప్రస్తుతం లభించడం లేదు. వారం క్రితం పలమనేరు డివిజన్‌కు 9,580 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. దీనిని రెండ్రోజుల్లోనే రైతులు తీసుకెళ్లారు. అధికార పార్టీకి చెందిన కొందరు అవసరం లేకున్నా భారీగా యూరియాను తీసుకెళ్లారు. ఫలితంగా చిన్న, సన్నకారు రైతులకు బస్తా యూరియా కూడా లభించని పరిస్థితి నెలకొంది. దీంతో వీరు పొరుగునే ఉన్న కర్ణాటకలో యూరియాను కొనుక్కోవాల్సి వచ్చింది. ఈ విషయమై స్థానిక ఏడీ అన్నపూర్ణదేవి మాట్లాడుతూ ప్రస్తుతానికి యూరియా కొరత కొంత ఉందని, అయితే త్వరలోనే కావాల్సిన యూరియా పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందన్నారు.

యూరియా ఎక్కువగా వాడితే నష్టమే



ఈ మధ్య వరినాటిన రైతులు ఇష్టానుసారంగా యూరియాను వాడుతున్నారు. దీంతో మొక్క ఏపుగా పెరగడంతో క్రిమికీటకాల తాకిడి ఎక్కువై తెగుళ్లు ఆశిస్తాయి. భూమి సారాన్ని కోల్పోయి క్రమేణా చౌడు బారిపోతుంది. ఎకరా వరి పొలానికి అవసరాన్ని బట్టి పంట మొత్తం కాలంలో రెండు బస్తాల యూరియా చాలు. కానీ కొందరు రైతులు దీనిపై అవగాహన లేక విపరీతంగా వాడుతున్నారు. ముఖ్యంగా పశుగ్రాసానికి దీన్ని అసలు వాడరాదు. –సంధ్య, వ్యవసాయాధికారిణి, పలమనేరు

పంట పచ్చగా కనపడాలని..!



కొందరు రైతులు వరి పంట పచ్చగా ఏపుగా పెరగాలని విపరీతంగా యూరియాను వాడుతున్నారు. రైతు సేవా కేంద్రాలకు యూరియా వస్తే చాలు ముందుగానే వెళ్లి తీసుకుని వరికి వేస్తున్నారు. దీనివల్ల నష్టమే ఎక్కువ అని వారు తెలుసుకోవడం లేదు. కనీసం అధికారుల సూచనలను పాటించకుండా విచ్చలవిడిగా వాడుతున్నారు. దీనికి బదులు నానో యూరియా, డీఏపీలను అవసరమైనంత వాడుకోవచ్చు. –సుబ్రమణ్యంరెడ్డి, ఆదర్శ రైతు, కల్లాడు, పలమనేరు మండలం

రోడ్డులో గుంతలు పూడ్చాలని ధర్నా



రహదారిపై బైఠాయించి ధర్నా చేస్తున్న అయూబ్‌ఖాన్, విద్యార్థులు

పుంగనూరు: పుంగనూరు నుంచి రామసముద్రంకు వెళ్లే రహదారిలో గుంతలను పూడ్చాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ముక్తిమోర్చా కార్యదర్శి అయూబ్‌ఖాన్ ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం స్థానిక ఎస్‌ఎస్.పేట రోడ్డుపై బైఠాయించి, ధర్నా , రాస్తారోకో చేశారు. వారు మాట్లాడుతూ, రోడ్డు గుంతలమయమై తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, బసరాజ కళాశాల, శుభారాం డిగ్రీ కళాశాలతో పాటు ఏరియా ఆసుపత్రి ఉన్న రోడ్డు మీదుగా కర్ణాటకలోని శ్రీనివాసపురానికి వెళ్లాల్సి ఉందన్నారు. వందలాది వాహనాలు, వేలాది మంది విద్యార్థులు తిరిగే రహదారి గుంతలమయమైనా సంబంధిత అధికారులు మరమ్మతులు చేయడం లేదని అయూబ్‌ఖాన్ విమర్శించారు. పలుమార్లు అధికారుల దృష్టికి సమస్యను నివేదించినా స్పందించకపోవడంతో ఆందోళనకు పూనుకున్నట్టు చెప్పారు.

పోషకాహారంతో రక్తహీనత దూరం



గర్భవతులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ విజయలక్ష్మి

కల్లూరు (రొంపిచెర్ల): గర్భవతులు, బాలింతలు క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకుంటే రక్తహీనత సమస్య బారిన పడరని పులిచెర్ల మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. ఆమె గురువారం 106 రామిరెడ్డిగారిపల్లె, చెరువు ముందరపల్లె అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహార వారోత్సవాలను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, గర్భవతులు, బాలింతలు ప్రతి నెలా వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. రక్తహీనత సమస్య తలెత్తకుండా ఉండేందుకు తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. కౌమార దశలో ఉన్న ఆడపిల్లలు కూడా ఇదే ఆహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మీనా కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌పై డ్వాక్రా సభ్యులకు అవగాహన



ఓపెన్ స్కూల్‌పై అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ

రొంపిచెర్ల: ఓపెన్ స్కూల్‌ను సంఘమిత్రలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ ఇందిర కోరారు. గురువారం. స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఓపెన్ స్కూల్ గురించి అవగాహన కల్పించారు. ఓపెన్ స్కూల్ పది, ఇంటర్‌మీడియట్ చదువుకోవచ్చన్నారు. ఒక సంవత్సరంలో పూర్తి చేసుకునే అవకాశం ఉందన్నారు. రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ తరగతులు ప్రారంభిస్తామని, చదువుపై ఆసక్తి కలిగిన ఏ వయస్కుల వారైనా చేరవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు లోకనాధరెడ్డి, సీసీలు రమణా రెడ్డి, వెంకటనారాయణ స్వామి, సీఆర్‌పీలు రాజేంద్ర, కిరణ్, అనసూయ పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డులో మట్టి, ముళ్లపొదలు తొలగింపు



మినీ పీఎల్ఆర్ బైపాస్‌రోడ్డుపై మట్టి తొలగిస్తున్న మున్సిపల్ కార్మికులు

పుంగనూరు: పట్టణంలోని పీఎల్ఆర్ మినీ బైపాస్ రోడ్డులో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. బైపాస్‌రోడ్డులో వర్షాలకు మట్టి పేరుకుపోవడంతో వాహనాలు మట్టిలో బ్రేకులు పడక తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. దీనిపై కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఫిర్యాదులు అందడంతో ఆయన స్పందించారు. కార్మికులతో సుమారు రెండు కిలోమీటర్ల పొడవునా రోడ్డుపై ఉన్న మట్టిని తొలగించి, ట్రాక్టర్లలో తరలించారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలను తొలగించారు. కమిషనర్ మాట్లాడుతూ, పట్టణంలో ప్రతి రోజూ కార్మికులతో ఒక్కొక్క రోడ్డు, ఒక వీధి ఎంపిక చేసుకుని చెత్తదిబ్బలు, మురుగు నీటి కాలువలు, రోడ్డు శుభ్రం చేయిస్తామని, అలాగే దోమల నిర్మూలనకు రోజూ ఫాగింగ్ చేస్తామన్నారు. ప్రధానంగా ప్రైవేటు స్థలాల్లో కలుపుమొక్కలు పెరిగి, నీటి నిల్వలు అధికంగా ఉండడంతో దోమలు విజృంభిస్తున్నాయన్నారు. స్థలాలను శుభ్రం చేసుకోవాలని నోటీసులు జారీ చేస్తున్నామని, ప్రైవేటు స్థలాల వారు దీనికి స్పందించకపోతే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

శాంతిపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. బెంగళూరు శంకర్ నేత్రాలయ మొత్తం 147 మంది వైద్య పరీక్షలు చేసి, వీరిలో 77 మందిని ఆపరేషన్ల నిమిత్తం ఎంపిక చేశారని వైద్యాధికారులు డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ ప్రసాద్ తెలిపారు. వీరిని బెంగళూరుకు తరలించి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని చెప్పారు. శిబిరాన్ని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ప్రభావతి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ హనుమంతరావు, జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ అర్పిత పరిశీలించారు. అంతర్జాతీయ స్వచ్ఛ గాలి దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారులు పాల్గొన్నారు.

కౌలుకు శివాలయ భూములు వేలం

పలమనేరు: పట్టణంలోని శివాలయానికి పలమనేరు, గంగవరంలోని 13 సర్వే నంబర్లలోని11 ఎకరాల నంజ, పుంజ భూములను మూడేళ్లపాటు కౌలుకు ఇచ్చేందుకు స్థానిక శివాలయం వద్ద ఎండోమెంట్ అధికారుల సమక్షంలో గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. అయితే ఇందులో 4 ఎకరాలకు మాత్రం రూ.57వేలు ఆదాయం దక్కినట్టు ఈవో కమలాకర్ తెలిపారు.వేలం పాటదారులు, మదనపల్లె ఆలయాల ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలలో పోషకాలు పుష్కలం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

బైరెడ్డిపల్లె: చిరుధాన్యాలలో విలువైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయని హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ అన్నారు. మండలంలోని తీర్థంలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, రోగాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవాలని కోరారు. తక్కువ ఖర్చుతో క్కువ పోషకాలు ఉన్న ఆకుకూరలు, కూరగాయలు క్రమం తప్పకుండా ఆహారంలో తీసుకోవాలన్నారు. చిరుధాన్యాల వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు నీతి కథల పుస్తకాలు పంపిణీ



నీతి కథల పుస్తకాలు అందుకున్న విద్యార్థులు

పలమనేరు: పట్టణంలోని ఎస్సీ, బీసీ హాస్టల్ విద్యార్థులకు స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు గురువారం నీతికథలు, పద్యాల పుస్తకాలను పంపిణీ చేశారు. బొమ్మల పంచతంత్రం, భాగవతం, రామాయణం, భారతం పుస్తకాలను అందజేసినట్టు ఆయన చెప్పారు. వార్డెన్ మధుసూదన్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డీపీఎంఓ దేవదాస్

సదుం: కుష్టు వ్యాధిపై విద్యార్థులకు డీపీఎంఓ దేవదాస్ గురువారం అవగాహన కల్పించారు. ఎంజేపీ గురుకుల పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కుష్టు వ్యాధికి భయపడాల్సిన పని లేదని చెప్పారు. వంశపారం పర్యంగా ఈ వ్యాధి సంక్రమించదన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలు, వ్యాధి నిర్ధారణ, చికిత్సా విధానం గురించి తెలియజేశారు. ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, ఎంపీహెచ్ఈఓ ఉదయ భాస్కర్, ఎంఎల్‌హెచ్‌పీ జోసెఫ్ తదితరులుపాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు చట్ట సవరణకు వ్యతిరేకంగా ధర్నా



పుంగనూరులో నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్‌డీపీఐ నేతలు



ధర్నా చేస్తున్న ఎస్‌డీపీఐ నాయకులు

పెద్దపంజాణి: కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు చట్ట సవరణను పార్లమెంటు ముందుకు తీసుకు వచ్చిన నేపథ్యంలో సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. దీనికి నేతృత్వం వహించిన పార్టీ పంచాయతీ అధ్యక్షులు మహబూబ్ మాట్లాడుతూ, చట్ట సవరణ ప్రతిపాదనను విరమించుకోవాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు జమీర్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: ముస్లింల ఆస్తులకు, హక్కులకు భంగం కలిగించే వక్ఫ్ బోర్డు చట్ట సవరణను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం పుంగనూరులో ఎస్‌డీపీఐ నాయకులు గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రతినిధులు జమీర్‌లాల్, అన్వర్‌బాషా, చాంద్‌బాషా, ఫయాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వక్ఫ్ బోర్డు చట్టాన్ని మైనారిటీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కుల, మతపిచ్చితో ముస్లింలకు వ్యతిరేకంగా చట్టాలు చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు ఖాదర్‌బాషా, జబి, ముబారక్, ఏజాస్, సద్దాం, సిద్దిక్, యూసుఫ్, మహబూబ్‌బాషా, హుజీప్, సుహేబ్, అతిక్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మండలస్థాయి క్రీడాపోటీలు



పరుగుపందెంలో పోటీ పడుతున్న బాలికల జట్లు



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న జట్లు

పుంగనూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడాపోటీలు గురువారం అడవినాధునికుంట ఆదర్శ పాఠశాల మైదానంలో నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రమ, పీఈటీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, పరుగుపందెం, ఖో-ఖో, షాట్‌పుట్, బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. మండలంలోని 10 హైస్కూళ్లకు చెందిన 200 మంది విద్యార్థినీ విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. పీడీ అమర, మణి, మధురిమ, జ్యోతిలక్ష్మి, శారద, సుమతి, మురళీధర్, కిరణ్, నితీన్, మహబూబ్‌బాషా, సాదిక్‌బాషా వివిధ పోటీలకు అంపైర్లుగా వ్యవహరించారు. విశ్రాంత అధ్యాపకుడు వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

మొక్కలు నాటిన స్కౌట్స్ అండ్ గైడ్స్



మొక్కలును నాటుతున్న ఉపాధ్యాయులు, స్కౌట్స్ అండ్ గైడ్స్

శాంతిపురం: మండలంలోని రాళ్లబూదుగూరు, సోగడబళ్ల ఉన్నత పాఠశాలలకు చెందిన స్కౌట్ అండ్ గైడ్స్ శాంతిపురం-కేజీఎఫ్ మార్గంలో దాదాపు 200 మొక్కలను నాటారు. స్వచ్ఛ పక్వాడా కార్యక్రమంలో భాగంగా సోగడబళ్లలో వారు పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మానవులతో సహా భూమిపై జీవ రాశులు మనుగడ సాగించాలంటే అందరూ విరివిగా మొక్కలను పెంచాలని చెప్పారు. కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్లు సిద్దారెడ్డి, ఈశ్వరయ్య, సోగడబళ్ల జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న సర్పంచ్ రాజ్‌గోపాల్

రామకుప్పం: మండలంలోని బందార్లపల్లె పంచాయతీ అభివృద్ధికి అధికారులు సహకరించాలని సర్పంచుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి రాజ్‌గోపాల్ కోరారు. గురువారం స్థానిక సచివాలయంలో స్థానిక సర్పంచ్ రాజ్‌గోపాల్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చేయవలసిన పనుల గురించి సభ్యులు చర్చించారు. అలాగే గ్రామాల్లో వీధి దీపాలు, మురుగునీటి కాలువలు, నీటి సంరక్షణ, పంచాయతీలో పారిశుద్ధ్య పనులపై ప్రజలకు అవగాహన కల్పించాలని తీర్మానించారు. పంచాయతీలో చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని సర్పంచ్ అధికారులను కోరారు. పంచాయతీ సిబ్బంది, స్థానిక నేతలు, ప్రజలు పాల్గొన్నారు.



ఏనుగులు ధ్వంసం చేసిన బీర పంట, విరిచేసిన కొబ్బరి చెట్లు

పంటలపై ఏనుగుల దాడి

పెద్దపంజాణి: మండలంలో కోగిలేరు సమీపంలోని పంటలను బుధవారం రాత్రి ఏనుగులు ధ్వంసం చేశాయి. గంగవరం మండలం కల్లుపల్లెకు చెందిన శంకరయ్య, క్రిష్టా రెడ్డి తదితరులు సాగు చేసిన దోస, బీర, వరి పంటలను తొక్కినాశనం చేశాయి. కొబ్బరి చెట్లను విరిచేశాయి. గురువారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటనష్టాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. సమాచారం అందుకున్న రాయలపేట ఫారెస్టు బీట్ ఆఫీసర్ రవికుమార్ పంట నష్టాన్ని పరిశీలించారు. ఏనుగుల దాడి నుంచి పంటల రక్షణకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తామని, ట్రాకర్ల సాయంతో ఏనుగులను అడవిలోకి మళ్లిస్తామని హామీ ఇచ్చారు.